## 23న శాంతిసరోవర్‌లో మహాశివరాత్రి వేడుకలు

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతి సరోవర్‌లో ఆదివారం మహాశివరాత్రి వేడుకలను నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సందర్భంగా సండే ఈవినింగ్ టాక్ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040–23001234లో సంప్రదించాలని సూచించారు.

## హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్

**జాయింట్ విన్నర్స్‌గా కళింగ, కాంటినెంటల్ వారియర్స్**



శేర్‌లింగంపల్లి: యువ గోల్ఫర్లను ప్రోత్సహించేందుకు గత నాలుగేళ్లుగా నిర్వహిస్తున్న హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ ఐదో సీజన్ విజయవంతంగా ముగిసింది. వియత్నాం బీఆర్జీ కింగ్స్ ఐలాండ్ గోల్ఫ్ కోర్సులో హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్ టైగా ముగిసింది. దీంతో కళింగ వారియర్స్ , కాంటినెంటల్ వారియర్స్ జట్లు సంయుక్త విజేతలుగా నిలిచాయి. ఇరు జట్ల మధ్య ఆధిపత్యం చేతులు మారుతూ చివరికి 40–40 స్కోర్ తో టై అయింది. కళింగ వారియర్స్ తరఫున ఆదిత్య జైన్, ఆదిత్య బొమ్మరాజు, రాఘవేంద్రరావు గుండాల, ఫహీమ్ ఖురేషీ 10 పాయింట్ల చొప్పున స్కోర్ చేశారు. కంటినెంటల్ వారియర్స్ గోల్ఫర్లలో జగన్మోహన్ రెడ్డి ఒంటెల, నవీన్ కుమార్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి కొట్టం, షాన్ కట్టా 10 పాయింట్ల చొప్పున స్కోర్ చేశారు. ఫైనల్ మ్యాచ్ టై కావడం లీగ్ చరిత్రలో ఇదే తొలిసారి.

## ఒక్క సీసీ కెమెరా వెయ్యి కళ్లతో సమానం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, ఏసీపీ

బాలానగర్: ఒక్క సీసీ కెమెరా వెయ్యి కళ్లతో సమానమని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి అన్నారు. శుక్రవారం బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆదర్శనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 32 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రజల భాగస్వామ్యం అభినందనీయమన్నారు. అనంతరం బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్ మాట్లాడుతూ.. సమాజ భద్రతలో భాగంగా ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకంగా ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, సీఐ టి. నరసింహరాజు, డీఐ నాగిరెడ్డి, ఎస్ఐలు రాంనారాయణ, సరళ, హాజీమియా, ఆదర్శనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శంకరయ్య, దుర్గ, ఆంజనేయులు, రవికుమార్, నాగ భూషణం, నాంచారమ్మ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న ఎలివేట్ ఎక్స్‌పో

- టీవర్క్స్ ప్రాంగణంలో ఏర్పాటు
- దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా..

చందానగర్:



‘ఎలివేట్ ఎక్స్ పో’పేరిట హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ వర్క్స్ ప్రాంగణంలో ప్రత్యేక ఎక్స్‌పో సందర్శకులను ఆకట్టుకుంది. దక్షిణ భారతదేశంలో మొదటి అతిపెద్ద మార్కెటింగ్ ఎక్స్‌పోను శుక్రవారం ఇక్కడ ఏర్పాటు చేశారు. పలు సంస్థలకు చెందిన రకరకాల ఉత్పత్తులు, రూపొందించిన యాప్‌ల ను ఈ సందర్భంగా ప్రదర్శించారు. ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన ఉత్పత్తులు, యాప్‌ల వివరాలను సందర్శకులు ఆసక్తిగా తిలకిస్తూ వాటి గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. సుమారు 20 కంపెనీలు ఉత్పత్తి చేసిన వాటిని, కొన్ని సంస్థలు రూపొందించిన యాప్‌లను ప్రదర్శనలో ఉంచారు. డిజిటల్ మార్కెటింగ్, ఇతర అవకాశాల ద్వారా తమ ఉత్పత్తులకు మంచి అవకాశాలు వచ్చే విధంగా చేసేందుకు, సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించే అవకాశం కల్పించడం ద్వారా పలు సంస్థలు ఉత్సాహంగా ఈ ఎక్స్‌పోలో ప్రదర్శించాయి.

### ఎంతో ఉపయుక్తం

టీడబ్ల్యూజీ యాప్ ద్వారా డిజిటల్ మార్కెటింగ్‌కు ఎంతో ఉపయుక్తం అవుతుంది. ఏఐ సహకారంతో దీన్ని రూపొందించాం. వ్యాపారాలు తమ ఉత్పత్తులపై సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడానికి మా యాప్ అవకాశం కల్పిస్తుంది.
–టీ డబ్ల్యూజీ, యాప్ నిర్వాహకులు




టీ వర్క్స్‌లో ఏర్పాటు చేసిన ఎలివేట్ ఎక్స్‌పోలో టీడబ్ల్యూజీ యాప్ నిర్వాహకులు

### ఎక్స్‌పో ద్వారా మంచి అవకాశాలు



2023 నుంచి ఎలివేట్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నారు. ఎలివేట్ ఎక్స్‌పో ఉత్పత్తుల చేయడమే కాదు వాటిని ప్రజలకు చేరువ అయ్యేలా ప్రచారం చేయడానికి ఉంతో ఉపయోగకరం. పలు సంస్థలు పరస్పరం తెలుసుకోవడానికి, కలిసి పనిచేసేందుకు అవకాశం కల్పించేలా ఈ ఎక్స్‌పో ఎంతో దోహదం చేస్తుంది. –విద్యాసాగర్, మేనేజర్

## గ్రేటర్ అభివృద్ధే ధ్యేయం

**స్టాండింగ్ కమిటీ సభ్యుడు జగదీశ్వర్ గౌడ్**



చందానగర్ : సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశంలో, మంత్రి నాయకత్వంలో గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధికి పక్క ప్రణాళికతో ముందుకు సాగుతామని నూతన గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాదాపూర్ డివిజన్ కార్పొరేటర్ వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని కాలనీ, బస్తీల అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపట్టేలా చూస్తామని తెలిపారు. నూతన గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఆయన శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిల శ్రీధర్ బాబు, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఆర్ట్ థెరపీతో కేన్సర్ రోగుల జీవితాల్లో వెలుగు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని నానక్‌రాంగూడ స్టార్ హాస్పిటల్స్ యూనిట్‌లో శుక్రవారం స్టార్ కేన్సర్ సెంటర్‌లో కేన్సర్‌తో పోరాడుతున్నవారికి స్ఫూర్తిదాయకమైన ఆర్ట్ థెరపీ సెషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా స్టార్ హాస్పిటల్స్ మెడికల్ ఆంకాలజీ సీనియర్ కన్సల్టెంట్ హెడ్ డాక్టర్ సాయినాథ్ బి.మాట్లాడుతూ ‘ఈ కేన్సర్ చికిత్స కేవలం వ్యాధిని నయం చేయడం మాత్రమే కాదు, రోగి సంపూర్ణ ఆరోగ్యంగా కోలుకోవడంలో గణనీయమైన ప్రభావాన్ని చూపుతుంది’అని అన్నారు. స్టార్ హాస్పిటల్స్ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్, సర్జికల్ ఆంకాలజీ డాక్టర్ విపిన్ మాట్లాడుతూ కేన్సర్ రోగి ప్రయాణం శారీరకంగా, మానసికంగా సవాలుగా ఉంటుందన్నారు.

## కులగణనపై అవగాహన

గచ్చిబౌలి: కులగణన ప్రాముఖ్యత, సంక్షేమ పథకాలపై ప్రభావాన్ని అర్థం చేసుకునేందుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం కొండాపూర్ డివిజన్ పరిధిలో అంజయ్యనగర్ వార్డు కార్యాలయంలో రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు తిరుమలగిరి సురేందర్, శేరిలింగంపల్లి సర్కిల్ ఏఎంసీ శ్రవణ్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కేశురావులు స్థానికులకు అవగాహన కల్పించారు. కులగణన ఆధారంగానే సంక్షేమ ఫలాలు అందుతాయని తెలిపారు. సంక్షేమ పథకాలు లబ్ధిదారులు ఎలా అందించడం జరుగుతుందో వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు నర్సింహారావు, సీతారాములు, తిరుపతి సాగర్ తదితరులు పాల్గొన్నారు.



## రూ.79.58 కోట్లతో నాలాల విస్తరణ



శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గపూర్‌నగర్ కాలువ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ హమీద్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఎస్ఎన్‌డీపీ ఫేజ్–2లో భాగంగా రూ.79.58 కోట్ల వ్యయంతో నాలాల విస్తరణ పనులు చేపట్టామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ చెప్పారు. కొండాపూర్ డివిజన్‌లోని గపూర్‌నగర్ జంక్షన్ నుంచి దుర్గం చెరువు వరకు రూ.11.55 కోట్లతో చేపట్టే వరదనీటి కాలువ నిర్మాణ పనులకు కార్పొరేటర్ హమీద్ పటేల్‌తో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ముంపు నుంచి విముక్తి కల్పించేందుకు శాశ్వత చర్యలు చేపట్టామన్నారు. వర్షాకాలం లోపు పనులన్నీ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం వస్తే ప్రజలకు వరద ఇక్కట్లు తప్పేవి కావని, కంటి మీద కునుకు లేకుండా తీవ్ర ఆందోళనకు గరయ్యేవారన్నారు. రహదారుల నిర్మాణానికి కూడా తగిన ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. అందులో భాగమే లింకురోడ్లు, ప్రధాన రోడ్ల విస్తరణ, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. కాలనీల్లో అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా మార్చడం , డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచడం వంటి చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎన్‌డీపీ డీఈ రాజు, ఏఈ నిఖిల్, నాయకులు రవిముందిరాజ్, శ్రీనివాస్‌యాదవ్, ఊట్ల కృష్ణ, శ్రీనివాస్‌చౌదరి, తిరుపతిరెడ్డి, తిరుపతి, శ్రావణ్‌యాదవ్, ఊట్ల దశరథ్, రజనీకాంత్, శ్రీనివాస్, నరేష్, అనీల్, వినయ్ పాల్గొన్నారు.

## శాస్త్రీయ ఆవిష్కరణలే ‘మనూ’ లక్ష్యం

**‘మనూ’ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీఎఫ్ రహమాన్**



సదస్సులో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ పీఎఫ్ రహమాన్ తదితరులు

రాయదుర్గం: శాస్త్రీయ ఆవిష్కరణలను పెంచడం, విద్యాపరమైన నైపుణ్యాలు విద్యార్థులలో పెంపొందించడమే లక్ష్యంగా ఉర్దూ విశ్వవిద్యాలయం పని చేస్తుందని ‘మనూ’ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.ఎఫ్.రహమాన్ అన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం(మనూ)లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్ ఆధ్వర్యంలో ‘మనూ’అప్లైడ్ ఫిజిక్స్‌లో వస్తున్న మార్పులపై జరిగిన అంతర్జాతీయ సదస్సుకు ఆయన అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనువర్తిత భౌతికశాస్త్రంలో తాజా పరిణామాలను చర్చించేందుకు నిపుణులు, పరిశోధకులు, విద్యావేత్తలను ఒక చోట చేర్చి సమావేశం నిర్వహించే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. సదస్సులో ఢిల్లీ విశ్వవిద్యాలయం ఫిజిక్స్, ఆస్ట్రోఫిజిక్స్ విభాగ ప్రొఫెసర్ ఎస్ఏహాష్మీ, ఢిల్లీ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫిజికల్ సైన్సెస్ ప్రొఫెసర్ మనీష్‌కుమార్, ప్రొఫెసర్ మహ్మ ద్ రఫీక్ అబు తురాబ్, ప్రొఫెసర్ అలీమ్ హెచ్ భాషా, సదస్సు కన్వీనర్ డాక్టర్ మహ్మద సాదిక్ పాల్గొన్నారు. సదస్సుకు ఏడు దేశాల నుంచి 130 కంటే ఎక్కువ పత్రాలు సమర్పించగా, అందులో 110 పత్రాలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో పలువురు ఫిజిక్స్ ప్రొఫెసర్లు, నిష్ణాతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మతిస్థిమితం లేని మహిళ కిడ్నాప్

**ఆటో డ్రైవర్ ఫోన్‌కాల్‌తో అప్రమత్తమైన పోలీసులు**

- లైంగికదాడికి పాల్పడి ఉండవచ్చని అనుమానం
- ఇద్దరు నిందితుల అరెస్ట్ ?

మియాపూర్: రోడ్డుపై నిలబడి ఉన్న మతిస్థిమితం లేని మహిళను ఇద్దరు వ్యక్తులు బలవంతంగా బైక్‌పై ఎక్కించుకుని కిడ్నాప్ చేసిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మియాపూర్, బొల్లారం క్రాస్‌రోడ్డులోని బస్టాప్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున మతి స్థిమితం లేని మహిళ(38) నిలబడి ఉంది. అదే సమయంలో అక్కడికి వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమెను బలవంతంగా స్కూటీపై ఎక్కించుకుని తీసుకెళ్లారు. దీనిని గుర్తించిన ఓ ఆటోడ్రైవర్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించగా సదరు మహిళను బ్లూ కలర్ స్కూటీపై తీసుకెళ్లినట్లు గుర్తించి రెండు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. ఆ తర్వాత కొద్దిసేపటికి బొల్లారం రోడ్డుపై తిరుగుతున్న ఆమెను గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పలుమార్లు విచారించినా ఆమె వివరాలు చెప్పలేకపోయింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. నిందితులు ఆమెపై లైంగిక దాడికి పాల్పడి ఉండవచ్చుననే అనుమానంతో బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కాగా సదరు మహిళ కూకట్‌పల్లికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మతిస్థిమితం కోల్పోయిన ఆమె బస్టాప్‌లలో తలదాచుకుంటూ రోడ్లపై తిరుగుతున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా మియాపూర్ పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చందానగర్: చందానగర్ సెక్షన్ పరిధిలోని హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిదిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దీప్తి పేర్కొన్నారు.

- మార్తాండనగర్, ఆదిత్యా ఇంపీరియల్ హైట్స్ ఫీడర్ల పరిధిలో ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 05.00 వరకు మార్తాండనగర్, న్యూ హఫీజ్‌పేట్, హనీఫ్ కాలనీ, ఆదిత్యా ఇంపీరియల్ హైట్స్, వినాయకనగర్, ప్రకాష్‌నగర్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

**హఫీజ్‌పేట్ సెక్షన్ పరిధిలో...**

- హఫీజ్‌పేట్, ఆదిత్యనగర్ ఫీడర్ల పరిధిలో ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 05.00 వరకు ఓల్డ్ హఫీజ్‌పేట్, సాయినగర్, యూత్ కాలనీ, వార్డు ఆఫీస్, గ్రీన్ బవార్జి, ఆదిత్యనగర్, ఎస్‌సీబీ కాలనీ, ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.
- మాతృశ్రీ, శ్రీలీలా, విశ్వంభర ఫీడర్ల పరిధిలో ఉదయం 10.00 నుంచి మధ్యాహ్నం 12.00 వరకు మాతృశ్రీనగర్ కొంతభాగం, విశ్వంభర, శ్రీలీలా విల్లాస్, వాటర్ వర్క్స్, కల్వరి టెంపుల్, శిల్పా ఎవెన్యూ, ఎస్ఎంఆర్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.
- కల్యాణ గార్డెన్స్, మాధవ నగర్, దుర్గామాత ఫీడర్ల పరిధిలో ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 01.30 వరకు మాతృశ్రీనగర్ కొంత భాగం, మాధవనగర్, అంబేద్కర్‌నగర్, నందినగర్, బొమ్మరిల్లు, సాయిరంగా థియేటర్, రాజారాం కాలనీ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.
- గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర ఏఈ ఎస్.రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉందయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓయూ ప్రొఫెసర్స్ కాలనీ, మాధవిహిల్స్, గోల్డెన్ తులీప్ రోడ్ నెంబర్ 1, 2, 3, 4, 5, వెంకటరమణ టాటా మోటార్స్ లేన్, రాఘవేంద్ర కాలనీ హై టెన్షన్ లేన్, జేవీజీ హిల్స్, శిల్పవ్యాలీ, సెంట్రల్ పార్క్ ఫేజ్–2, మాధవ హిల్స్, గాయత్రి లేఅవుట్, కాంతివనం, కామ్లేట్ లేఅవుట్, మసీద్‌బండ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.
- మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ ఎస్.రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జేవీజీ హిల్స్, గాయత్రి లేఅవుట్, సెంట్రల్‌పార్క్ ఫేజ్–2,3, కాంతివనం, స్ప్రింగ్ వ్యాలీ, శిల్ప వ్యాలీ, రాఘవేంద్ర కాలనీ ఏ,బీ,సీ బ్లాక్‌లు, రాజరాజేశ్వరీనగర్, కొత్తగూడ విలేజ్, ఖానామెట్ ముస్లీం బస్తీ, మాతా భవనేశ్వరీ కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.





## సాంకేతిక అనుసంధానంతో మాతృభాషల పరిరక్షణ

రాయదుర్గం: తెలుగుభాషను సాంకేతిక పరిజ్ఞానంతో సమన్వయ పర్చుకుంటూ, సమకాలీన సామాజిక అవసరాలకు అనుగుణంగా మార్చుకొన్నంత వరకూ మాతృభాషలు అంతరించవని హెచ్‌సీయూ తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య పిల్లలమర్రి రాములు అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ తెలుగుశాఖలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాష కోసం తూర్పు పాకిస్థాన్‌లో ప్రాణాలర్పించిన ఉద్యమకారుల త్యాగాన్ని వివరించారు. ఈ సంఘటన కారణంగానే యునెస్కో ప్రతి యేడాది ఫిబ్రవరి 21వ తేదీన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని జరుపుకోవాలని నిర్ణయించినట్లు చెప్పారు. తెలుగు శాఖ మాతృభాష పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. అనంతరం తెలుగుశాఖ పూర్వ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్యులు పమ్మి పవన్‌కుమార్, వారిజారాణి, త్రివేణి, వంగరి, డాక్టర్ భూక్యా తిరుపతి, డాక్టర్ పి.విజయకుమార్, డాక్టర్ బాశెట్టి లత ప్రసంగించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య పిల్లలమర్రి రాములు

# చిత్రలేఖనంలో చిచ్చరపిడుగులు



గచ్చిబౌలిలోని కేంద్రియ విద్యాలయలో రెండో విడత చేర్యాల పెయింటింగ్‌పై వర్క్‌షాప్‌లో చిత్రాలు గీస్తున్న విద్యార్థులు




కేంద్రియ విద్యాలయలో రెండో విడత చేర్యాల పెయింటింగ్‌పై వర్క్‌షాప్‌లో విద్యార్థులు వేసిన చిత్రాలు చూసి అభినందిస్తున్న నిష్ణాతుడు మధు

**విద్యార్థులకు చేర్యాల్ నిష్ణాతుడు మధు మేరుగోజు ప్రత్యేక శిక్షణ**

రాయదుర్గం: అక్షర జ్ఞానమేకాదు చిత్రకళ అందులోనూ ప్రఖ్యాత చేర్యాల పెయింటింగ్‌లోనూ విద్యార్థులు ఆసక్తిని పెంచుకుంటున్నారు. గచ్చిబౌలిలోని కేంద్రియ విద్యాలయలో చేర్యాల పెయింటింగ్‌పై నిష్ణాతుడు మధు మేరుగోజు పర్యవేక్షణలో చేర్యాల్ పెయింటింగ్‌పై విద్యార్థులకు ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం 8వ తరగతి విద్యార్థులకు రెండో వర్క్‌షాప్‌ను ప్రిన్సిపాల్ జితేంద్రకుమార్ ప్రారంభించారు. అనంతరం మధు ఆధ్వర్యంలో ఆర్ట్ టీచర్ శివకుమార్, ఇతర ఉపాధ్యాయుల పర్యవేక్షణలో చేర్యాల పెయింటింగ్‌లోని మెళకువలు, పలు సూచనలు, రంగులు వేయడంలో అవగాహన కల్పించారు.

**ఆకట్టుకున్న పెయింటింగ్‌లు**

కేంద్రియ విద్యాలయలో రెండు విడతల్లో చేర్యాల పెయింటింగ్‌పై వర్క్‌షాప్‌ల నిర్వహణ అనంతరం విద్యార్థులు గీసిన పెయింటింగ్‌లు అందరినీ ఆకట్టుకునేలా చేశాయి. విద్యార్థులు వేసిన చిత్రాలు చూసి చేర్యాల పెయింటింగ్ నిష్ణాతుడు మధు వారిని అభినందించారు. ప్రిన్సిపాల్ జితేంద్రకుమార్ మాట్లాడుతూ చదువులకే పరిమితం కాకుండా చిత్రలేఖనం, క్రీడలు, ఇతర రంగాలలో విద్యార్థులు రాణించేలా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు.



గచ్చిబౌలిలోని కేంద్రియ విద్యాలయలో 8వ తరగతి విద్యార్థులు వేసిన పెయింటింగ్స్

## ‘టీటా’ సభ్యత్వ నమోదు ప్రారంభం



రాయదుర్గం: తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్(టీటా) సభ్యత్వ నమోదు ప్రక్రియను ఆ సంస్థ అంతర్జాతీయ అధ్యక్షుడు సందీప్‌కుమార్ మక్తల ప్రారంభించారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ హబ్ ప్రాంగణంలో టీటా కార్యాలయంలో సభ్యత్వ నమోదు ప్రక్రియను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, కార్పొరేట్ మెంబర్లు, ఎస్ఆర్ఐలు, విద్యార్థులు, అసోసియేట్ సభ్యులు, ఐటీ ఫ్యాకల్టీ, ప్రభుత్వ రంగం నుంచి ఐటీ విభాగంలో ఉన్నవారు సభ్యులుగా చేరవచ్చని ఆయన సూచించారు. సాంకేతిక అక్షరాస్యత కోసం గ్రామాల దత్తత తీసుకోవడంతోపాటు నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించడం కోసం డిజిథాన్ కార్యక్రమం చేపట్టామని పేర్కొన్నారు.